
31-ILL EPS




**కాంతం అలాంటి పని చేస్తుందనుకోలేదు.**

**చిన్న పిల్ల ఏం కాదు కాంతం. అరవై ఏళ్ళొచ్చాయ్. మనమల్ని ఎత్తింది.**

**వెనుక, కాచి వడపోసిన జీవితానుభవం. ఆపైన, జన్మతః స్త్రీగా పుణికి పుచ్చుకున్న సహజ సద్గుణాలు - ఓర్పు నేర్పు, విజ్ఞత, సహృదయత, త్యాగశీలత - ఇన్ని ఉన్నాయ్.**

**అలాంటి కాంతం, ఇలాంటి పని చెయ్యటమా!?**

**కాంతం, మా పారిజాతానికి పిన తల్లి కూతురు. అర్ధశతాబ్దం క్రితం....**

పెళ్లి నాటికి పారిజాతం వయసు పదిహేను. అప్పుడు కాంతానికి పదమూడు. ఏళ్ల పదమూడే అయినా వయసుకి మించిన విగ్రహం.

ఛాయ నల్లని నలుపే అయినా, ముక్కూ మొహం చూడటానికి చాలా ముచ్చటగా ఉంటాయ్ అనే వాళ్లు మా పెళ్లిలో అంతా.

మా పెళ్లిలోనే కాంతానికి కూడా మొగుణ్ని చూశారు.

రజనీకాంతరావ్, మా వైపు బంధువుల్లో ఒకరికి చాలా దగ్గర.

కాంతం ఊరు, పారిజాతం ఊరు పక్కపక్కనే.

రజనీకాంతరావ్ చాలా సరదా మనిషి. ఎంతో కలుపుగోలుగా ఉంటాడు అందరితోటీ.


సంక్రాంతికనీ, దసరాకనీ - ఇలా పండగలకు పబ్బాలకూ అత్తారింటికి వెళ్లి, వాళ్ల నెత్తి మీద కూర్చుని, మాపెయ్యటం అల్లుళ్ల జన్మ హక్కు కదా.

"అన్నగారూ!.. సంక్రాంతి పండక్కి మీరూ, వదినెగారూ మేడపాడు ఎప్పుడు వెళ్తున్నారో దయచేసి నాకు తెలియపరచండి. నేనూ, మా కాంతం కూడా సరిగ్గా అదే రోజుకి బిక్కవోలు వస్తాం. మీ అత్తారింట్లో మూడు రోజులూ, మా అత్తారింట్లో మూడురోజులు మనం అందరం కలిసి పండగ సరదాగా గడుపుదాం." రజనీకాంతరావ్ ముందుగా వ్రాసేవాడు.

అలా ప్రతీ పండక్కి. ముందే ప్రోగ్రాం వేసుకుని, వారం పదిరోజులు అందరం కలిసి సరదాగా గడిపే వాళ్లం.

చర్చిల్ చుట్టలంటే పడిచచ్చేవాడు రజనీ కాంతరావ్.

ఆ రోజుల్లో వాటికి చాలా పేరు. సుమారు నాలుగంగుళాల పొడవున, తిరగలి గురుజంత దొడ్డుగా ఉండేవి. మా ఊరు ఆ చుట్టలకు ప్రసిద్ధి! నేను ఏ పండక్కి వెళ్లినా, రెండు మూడు కట్టలు కొని పట్టుకెళ్లే వాడిని. ఒక్కొక్క కట్టలో వందేసి ఉండేవి.



"ఆఁ.... పట్టుకొచ్చారా, అన్నగారూ!"

ఓ బ్యాంక్ చెక్కును సంతకం పెట్టి, చేతిలో పెట్టినంత సంబర పడిపోయేవాడు. పెదవుల మధ్య కాలుతూన్న చుట్టను అవతల పారేసి, నే నందించిన కట్టల్లోంచి ఓ కొత్త చుట్టను తీసి, ముట్టించుకుని, వేళ్లతో దాని ముని పళ్ల మధ్య తిప్పుతూ, తృప్తిగా పొగ పీల్చి, బొగ్గు రైలింజన్‌లా వొదిలేవాడు.

"మీ మరదలు ఓ పూట వేరే గదిలో పడుకున్నా ఫర్వాలేదు కాని, ఈ చుట్ట మాత్రం పక్కలో ఉండాలి!"

మధ్య మధ్య జోకు లేసేవాడు. కేవలం చుట్టలతో సరిపెట్టుకోలేదు రజనీకాంతరావ్.

అంత పొగాకు చూరా, ఇంత సున్నం ముద్దా ఇంకా ఏవేవో వేసిన జర్దాకిల్లీ నిత్యం బుగ్గన ఉండాల్సిందే. జర్దాకిల్లీ నిత్యం బుగ్గన పెట్టుకుని నమిలే వాళ్లు మాట్లాడే తీరూ అదీ ఎలా ఉంటుందో మీరు గమనించే ఉంటారు. నోట్లో ఎప్పుడూ ఇంత ఉమ్మి ఉంటుంది. మెడ కొంచెం పైకెత్తే మాట్లాడుతూ ఉంటారు. పెదవులు వంకర్లు తిరిగి పోతూ ఉంటాయ్. ఉచ్చారణ మొదబ్బాయ్ మాటలా ఉంటుంది. స్పష్టత ఉండదు.

రజనీకాంతరావ్ మాట్లాడుతూంటే చూడ టానికీ, వినటానికీ చాలా వినోదంగా, ఆసక్తి కరంగా ఉండేది.

"రజనీకాంతరావ్!... మళ్లీసారి పండక్కి వచ్చే నాటికి నువ్వు ఆ చుట్టా, ఈ కిల్లీ వదిలెయ్యాలయ్యా!" అన్నాను ఓ రోజున శ్రేయోభిలాషిగా.

"అంతమాట అనకండి అన్నగారూ!.. ఒకటి గుండె, ఇంకొకటి ఊపిరితిత్తులు!"

"ఆ చుట్టా, ఈ కిల్లీ ఆరోగ్యానికి ఎంత హానికరమో నీకు తెలుసా? ఇది రెండూ భయంకరమైన క్యాన్సర్ వ్యాధికి దోహదకాలు. ఈ అలవాట్లు మానుకో, నా మాట విను."

"అన్నగారూ!... ఈ రెండు సేవించి, మా తాత తొంభైతొమ్మిదే ళ్లున్నాడు. మా నాన్న తొంభైఆరు. ఈ రెండే మనిషి ప్రాణాలు పోవటానికి కారణాలైతే, మనదేశ జనభాలో ఇప్పుడు సగమే ఉండేది...

నేను కనీసం తొంభై ఏళ్ల గ్యారంటీ అన్నగారూ!"

ఇహ అతనితో చెప్పి ప్రయోజనం లేదని కాంతంతో చెప్పాను.

"చూడు కాంతం!.... అతని చేత ఈ దురలవాటు ఎలా మానిపిస్తావో ఏమో బాధ్యత నీది. నయానో, భయానో నీ ఇష్టం. మీ ఆడవాళ్ల దగ్గర ఓ వజ్రాయుధం ఉండనే ఉంది. అది ప్రయోగించు, అవసరం అయితే."

నవ్వుకుంది కాంతం. శక్తి వంచన లేకుండా ఆవేళ నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టింది.

"మీ రీ అలవాట్లు మానేస్తే కాని, నేను మెతుకు తినను. ముద్ద మింగను!" నిరాహార దీక్ష పూనింది.


ఒక్కతీ గదిలో పడుకుని, లోపల తలుపులు గడియ పెట్టేసుకుని అరిచి గీపెట్టినా తలుపు తీసేది కాదు. మాట ఇచ్చేవాడు. మళ్లీ రెండు రోజుల్లో మామూలే. నిరాహార దీక్ష, సహకార నిరాకర ణోద్యమం ఈ రెండు అస్త్రాలూ విఫలం.

కాంతం చేతులెత్తేసింది. ఏ ఆడది మాత్రం ఏం చేస్తుంది - మూడు ముళ్లూ వేసిన వాడు మొండిపీనుగైతే!

నలుగురి పిల్లల తండ్రి అయ్యాడు రజనీకాంత రావ్, ముప్పయ్ ఎనిమిదేళ్లు వచ్చేసరికి. ఓ అర్ధరాత్రి వేళ తీవ్రంగా ఎడతెరిపి లేని దగ్గు వచ్చింది. గుండె పట్టుకుని దగ్గుతూ, రక్తం కక్కుకున్నాడు. బాగా ముదిరి, ప్రాణం మీది కొచ్చే దాకా తెలీని దొంగ రోగం క్యాన్సర్.

రజనీకాంతరావ్ ది థ్రోట్ క్యాన్సర్. ముప్పయ్ తొమ్మిదో ఏడు సంక్రాంతి పండక్కి రజనీకాంత రావ్ లేడు. రజనీకాంతరావ్ లేని సంక్రాంతి హరిత పత్రాలను రాల్చేసి, బోసిగా వెలవెల పోతూన్న కొమ్మలతో మిగిలిన చెట్టు!

అటు మగదిక్కు కరవై, ఇటు కుటుంబం గడవటానికి తగిన ఆధారం లేక వీధిన పడ్డ కాంతాన్నీ, పిల్లల్నీ చేరదీసి ఆదుకుంది పెద్దక్క రమణమ్మగారు.




రమణమ్మగారు రోగిష్టిది. రక్తపోటు, చక్కెర వ్యాధి, ప్రేవుల్లో అల్సర్‌పుండు.

వంటా వార్పూ, ఇంటి పని అంతా తన మీదనే వేసుకుని ఆదుకున్న అప్పగార్కి పూర్తి విశ్రాంతి నిచ్చి సేవలు చేసి రుణం తీర్చుకుంది కాంతం.

కొడుకులు ఇద్దరూ కాలినడకన పట్నం వెళ్లి డిగ్రీ పాసయ్ ప్రయోజకులయ్యారు. పెద్దాడు కలకత్తాలో టాటా కంపెనీలో పని, చిన్నాడికి బెంగుళూరులో మైకో కంపెనీలో.

"ఆడపిల్లలకు పెళ్లిళ్లయిపోయాయ్. కొడుకులు సంపాదించుకుంటున్నారు. ఇహ, ఇప్పుడు ఏ తల్లి అయినా కొడుకుల దగ్గరా, కూతుళ్ల దగ్గరా గడపాలని ముచ్చట పడుతుంది. చేసినంత కాలం చేశావ్. రుణం తీర్చుకున్నావ్. ఇహ ఇప్పుడైనా ఆ కొడుకు దగ్గరకో, ఈ కొడుకు దగ్గరకో పోయి సుఖపడవచ్చు కదా!"

శ్రేయోభిలాషిగా, ఓ చిన్న సలహా ఇచ్చాను ఓ రోజున.

ముక్కు మీద వేలేసుకుంది కాంతం.

"నా కష్టకాలంలో నాకు నీడ నిచ్చి నన్ను ఆదుకున్న వటవృక్షం బావా మా అక్కయ్య. ఇన్నేళ్లూ నన్నూ, నా నలుగురు పిల్లల్నీ పోషించింది. ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసింది. మగపిల్లల్ని ప్రయోజకుల్ని చేసింది.

ఇప్పుడు దాని ఆరోగ్యం క్షీణించి, మంచాన పడింది. ఇలాంటి పరిస్థితుల్లో దానిని వదిలి పెట్టి పోయి, నా సుఖం నేను చూసుకోనా? నేనెంత చేసినా దాని రుణం తీర్చుకోలేను. నే నిక్కడే దానికి సేవలు చేస్తూ ఉండిపోవడం ధర్మం! ఆ ధర్మం నేను తప్పలేను బావా!"

కాంతం నిజాయితీకి, మనోధర్మానికీ, త్యాగశీలతకూ నేను మనసులో జోహార్లు అర్పించాను.

ఓ రోజున ఆ వటవృక్షం కూలిపోయింది.

ఇహ, అప్పట్నుంచీ చిన్నాడు జగ్గు దగ్గర బెంగుళూరులో ఉంటోంది కాంతం. చిన్నాడి ఇంటికీ, మా ఇంటికీ మధ్య దూరం రెండే రెండు కిలోమీటర్లు.

తరుచు కాంతం మా ఇంటికి వస్తూండేది. ఆఫీసుకి వెళ్తూనో, వస్తూనో నేనూ వాళ్ల ఇంటికి వెళ్తుండేవాణ్ని.

"ఇదిగో బావా!... నీకు పాకంగారెలంటే ఇష్టం కదా అని పది వేరేతీసి పెట్టాను.

"వేయించిన జీడి పప్పు ఉంటే, మా అక్కయ్య కూడా అక్కర్లేదు నీకు... తీసుకో, తిను..."

ఇలా వెళ్లినప్పుడల్లా, ఎంతో అభిమానంతో ఏదో ఒకటి తినపెడితేనే గాని, కదలనిచ్చేది కాదు. కర్మం చాలక, ఏ కారణం చేతనైనా రెండు రోజులు నేను వాళ్లయింటికి వెళ్లటం జరగకపోతే, "ఒరేయ్ జగ్గూ!.... పెదనాన్నగార్కి ఒంట్లో బాగో లేదో ఏమో!.... ఓసారి వెళ్లి చూచిరారా!" అని కొడుకుని పంపించేది మా ఇంటికి.

"నువ్వు చూపించే అభిమానానికి నీ రుణం తీర్చుకునేదెలా?"

"ఛ!... అదేవిటీ బావా!... ఎందుకు అంతంత లేసి మాటలు? మనసులో ఈ మరదలి మీద నీకు అభిమానం ఉంటే చాలు. అదే నాకు పదివేలు.

"పరస్పరాభిమానంతో, మానసికంగా మనం ఇంత దగ్గరైనా మన ఇద్దరి మధ్యా ఇంకా ఎంతో దూరం ఎడంగా ఉంచుతున్నట్లనిపిస్తోంది!"

"అంటే!?"

నా కళ్లల్లోకి సూటిగా గుచ్చి గుచ్చి చూసింది కాంతం.

చూసి, వెంటనే పమిట కొంగును అట్నుంచి ఇటు నిండుగా లాగి కప్పుకుంటూ, అక్కణ్నుంచి వంటింట్లోకి వెళ్లిపోయింది.

ఎంతసేపు అక్కడే నేను అలా నిలుచుండి పోయానో, ఇంటికి ఎలా వచ్చానో, నాకు అవగాహన లేదు.

* * *

ఆ వేళ నేను హాలులో కూర్చుని టీ.వి. చూస్తున్నాను. వీధి తలుపు తోసుకొని కాంతం రెండో కొడుకు జగ్గు, పెద్ద కూతురు మల్లి లోపలికి వచ్చి సరాసరి వంటింట్లోకి వెళ్లారు.

మామూలుగా వాళ్లు మా ఇంటికి ఎప్పుడూ వచ్చినా, "ఎలా ఉన్నారు పెద్దనాన్నగారూ! ఆరోగ్యం బాగుందా?" అని మాట వరసకయినా పలకరించి మరీ వెళ్లేవారు. కాని, ఈసారి అలా చెయ్యక పోవటానికి కారణం ఏమిటో నాకు అంతు పట్టలేదు. బహుశః, వాళ్ల దొడ్డమ్మ దగ్గరికి ఏదైనా తొందరపని మీద వచ్చారేమో! అని సరిపెట్టుకున్నాను.

వంటింట్లో కూర్చుని వాళ్ల దొడ్డమ్మ తోటీ, మా అబ్బాయ్ సీతాపతిరావ్, కోడలు జానకి తోటీ అర్ధ గంటకు పైగా ఏవేవో చర్చించుకుని వెళ్లిపోయారు.

"కాంతం పిల్లలు జగ్గు, మల్లి వచ్చారు. ఏం పనిమీద?" పారిజాతాన్ని అడిగాను.

"కాంతాన్ని మీరేదో చేశార్ట కదా. మీమీద ఫిర్యాదు పట్టుకు వచ్చారు!"

"కాంతం ఏమిటి?... నేనేదో చెయ్యటం ఏమిటి?.... ఫిర్యాదు ఏమని?" ఆశ్చర్యపోతూ అడిగాను.

కాంతం పిల్లలకూ, తనకూ మధ్య జరిగిన సంభాషణ పారిజాతం చెప్పటం మొదలు పెట్టింది.

"మొన్న మీరు వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు.... ఇంట్లో నువ్వు తప్ప ఇంక ఎవ్వరూ లేరని తెలిసే వచ్చాను...

'పని పిల్లలను బయటికి పంపించెయ్!' అన్నార్ట.

మీ చూపులు చూస్తే కాంతానికి భయం వేసిందట... అది అరచిందట.... వెంటనే ఫిట్ వచ్చి పడిపోయిందట!.... ఇక నుంచి, పెద్ద నాన్న గార్ని మా ఇంటి ఛాయలకు కూడా రావద్దని చెప్పు దొడ్డమ్మా! జగ్గు, వల్లి చెప్పిందిదీ."

"మరి, మీ రేమన్నారు?" నే నడిగాను పారిజాతాన్ని, మల్లి వాళ్లిద్దరి మధ్యా జరిగిన సంభాషణ ఇలా చెప్పింది.

"మీ అమ్మ పెద్దనాన్నగారికి కొత్తకాదు ఆమె పెద్దనాన్నగారు మీ అమ్మకు కొత్తకాదు - ఇద్దరూ బావా మరదళ్లు. చనువు కొద్దీ ఏమైన సరసోక్తులూ చతురోక్తులూ విసుకున్నారేమో. ఒక వేళ మీ అమ్మ ఆయన్ని ఎక్కడైన పొరబాటుగా అర్థంచేసుకున్న దేమో అన్నాం."

"లేదు దొడ్డమ్మా!... పెద్దనాన్న గారు ఏదో దురుద్దేశ్యంతోనే వచ్చారని మా అమ్మ చెబ్తోంది. ఆయన చూపులు కూడా అలాగే ఉన్నాయట."

"మీ పెద్దనాన్నగారు వెళ్లిపోయేదాకా మీ పనిపిల్ల అక్కడే ఉందా?"

"అక్కడే ఉందట దొడ్డమ్మా!"

"మీ పెద్దనాన్న గారు మీ అమ్మ వంటి మీద చేయి చేసుకొని బలాత్కారం లాంటిది ఏమైనా

చేశారా?"

"లేదు, అలాంటిదేమీ చెయ్యలేదట."

"ఫిట్ వచ్చిపడిపోయిందన్నావ్ కదా. అరచిన వెంటనే పడిపోయిందా?"

"అవును దొడ్డమ్మా!... అరవగానే, ఫిట్ వచ్చి పడిపోయిందట."

"మరి, ఆ అరుపులు వినిపించగానే, చుట్టు ప్రక్కల వాళ్లంతా పరుగెత్తుకు రాలేదా?... మీ ఇంట్లో నాలుగైదు వాటా వాళ్లు పక్కపక్కగానే ఉన్నారు కదా?"

"లేదు ఎవరూ రాలేదు."

"ఫిట్ వచ్చి పడిపోయినప్పుడైనా, అయ్యో.... అమ్మగారు పడిపోయారు అని గాభరా పడిపోతూ గబాగబా వెళ్లి చుట్టు ప్రక్కల వాళ్లను మీ పని పిల్ల పిల్చుకు వచ్చిందా?"

"లేదు దొడ్డమ్మా!"

"మీ అమ్మ ఫిట్ వచ్చి పోడిపోయేసరికి, మీ పెదనాన్నగారు అక్కడే ఉన్నారా? అప్పటికే వెళ్లి పోయారా?"

"అప్పటికే వెళ్లి పోయార్ట."

"ఈ విషయం మన రెండు కుటుంబాల మధ్యే ఉండాలి అని దొడ్డమ్మను హెచ్చరించి మరీ రమ్మని చెప్పింది మాఅమ్మ. లేకపోతే, మన రెండు కుటుంబాల గౌరవం రోడ్డున పడుతుంది."

"అది, ఇప్పుడెలా సాధ్యమే మల్లీ!?... మీ అమ్మ కూతుళ్లకూ, కొడుకులకూ చెప్పింది. కూతుళ్లు మొగుళ్లకు చెబ్తారు. కొడుకులు పెళ్లాలకు చెబ్తారు. ఇది మళ్లీ వాళ్లు వెళ్లి వాళ్ల వాళ్ల పుట్టింటి వాళ్లతో చెప్తారు. అది ఆ నోటా ఈ నోటా అలా అలా పాకుతుంది- అందరికీ తెలిసిపోతుంది. దురదృష్టవశాత్తూ, గుట్టుగా ఉంచుకోవాలనుకొన్న దానిని మీ అమ్మే రట్టు చేసుకుంది. తన వేళ్లతో తన కళ్లనే పొడుచుకున్నట్లయింది...

మీ అమ్మ ఉద్దేశ్యం అదే అయినట్లయితే, ఓ పని చెయ్యవలసింది. మీ అమ్మే మా ఇంటికి వచ్చి, "చూడవే అక్కయ్యా..! బావ ఏం చేశాడో అని అంతా తనే నాతో స్వయంగా చెప్పవలసింది. అవసరం అయితే మీ అమ్మముందే ఆయన్ని నిలదీసి అడిగేవాళ్లం. ఒకవేళ మీ అమ్మ మా ఇంటికి రావటానికి ఏమయినా అభ్యంతరాలు ఉంటే, మరెవరైనా వచ్చి, దొడ్డమ్మా నిన్ను మా అమ్మ ఓసారి అర్జంటుగా రమ్మంది. ఏదో ముఖ్యమైన విషయం నీతో మాట్లాడాలట అంటే నేనే వచ్చేదాన్ని మీ ఇంటికి."

"మరి, మీ ప్రశ్నలకు రాబట్టిన సమాధానాలను బట్టి చూస్తే మీ కేమనిపించింది?" నే నడిగాను మా పారిజాతాన్ని.

"పనిపిల్ల అక్కడే ఉంది....

వంటి మీద చెయ్యి వెయ్యలేదు...

బలాత్కారం చెయ్యలేదు....

మరి, అలాంటప్పుడు అరవ్వలసిన అవసరం గాని, ఫిట్ రావలసిన పనిగాని ఏంవొచ్చింది? చాలా లూజ్ ఎండ్సు ఉన్నట్లు అనిపిస్తోంది. ఒకదానికొకటి పొంతన కనిపించటంలేదు. కాంతమే నా దగ్గరకు వచ్చి స్వయంగా చెప్పి ఉంటే నా కెంతో ఊరట ఉండేది." పారిజాతం గొణుక్కుంది.

"నిందితుడికీ, నేరారోపణ చెయ్యబడ్డ వ్యక్తికీ సంజాయిషీ చెప్పుకునే అవకాశం ఇవ్వాలని న్యాయ శాస్త్రం ఘోషిస్తోంది, అత్తయ్యా!" లా ఫైనల్ ఇయర్ చదువుతూన్న మా కోడలు జానకి అత్తగారికి సూచన.

"వెర్రిదానా!... ఆడదాని నిందలూ నేరారోపణల ముందు నీ న్యాయ శాస్త్రాలు నాలుక గీసుకుందుకి కూడా కొరగావు... అలాగే ఆడదానికి సమ్మతం అయితే ఆ దివి నుండి ఈ భూమి వరకూ దానిని నిరోధించగలిగే శక్తి దేనికీ లేదు....

"ఇవన్నీ నీ చట్టాలలో, అచ్చు అక్షరాలలో ఉండవు తల్లీ...! ఆ అక్షరాల వెనకాల ఆ పంక్తుల మధ్య అగోచరంగా ఉంటాయ్!"

అత్తగారి ఆర్గుమెంట్స్‌కి మా కోడలు జానకిలోని లాయర్ కంటి ముందు న్యాయ వ్యవస్థ అంతా ఒక్కసారిగా కుప్పకూలిపోయింది.

"ఆల్‌రైట్.... ఫర్గెటిట్!" పారిజాతంతో అన్నాను.

నేను కూడా అంత పట్టించుకోలేదు.

* * *

ఆ వేళ మా దగ్గర బంధువుల ఇంట్లో పెళ్లి. కుటుంబంతో సహా వెళ్లాను నేను. అక్కడికి కాంతం కూడా వచ్చింది. కాంతాన్ని చూసి, నేను ఎడ మొహం, పెడమొహంగా తప్పించుకు తిరుగుతున్నాను దూరదూరంగా.

"ఎందుకు బావా, అలా తప్పించుకు తిరుగుతున్నావ్?"

నేను ఒంటరిగా ఉండటం చూసి పని కట్టుకుని వచ్చి, స్టెయిర్‌కేస్ ల్యాండిగ్ మీద నన్ను పలకరించింది కాంతం.

నాకు ఆశ్చర్యం వేసింది.

"కారణం నీకు తెలిసే ఎందుకు అడుగుతున్నావ్?" అన్నాను కొంచెం సీరియస్‌గా.

"నువ్వు నాకు రుణ పడి ఉన్నావ్ బావా!"

"నాకు ఏం మహోపకారం చేశావనీ!?" అదిరిపడి అయోమయంగా అడిగాను.

"బావ నన్ను బలాత్కరించి, రేప్ చెయ్యబోయాడు- అని చెప్పలేదు కదా, అందుకని!"

"నిజానికి, నేను అలాంటివి ఏమి చెయ్యలేదు కదా?" షాకు నుంచి తేరుకుంటూ అన్నాను.

వెటకారం ధ్వనించేలా, చిన్ననవ్వు లాంటిది నవ్వింది. "బావా..! ముందు నీ పేరు చూడకుండగా, పత్రికలో నీ రచన ఏదైనా చదివితే, నీ అక్షరాల వెనక నుంచి నువ్వు, దాని రచయితగా ఒక పెద్ద మేధావిలా, లోక జ్ఞానపు గనిలా కనిపిస్తావ్! ఓ ఉన్నత శిఖరాన్ని చూసినట్లు చూస్తాను నిన్ను...!

కాని, నిన్ను ఎదురుగా పెట్టుకుని, నీతో ముఖాముఖి మాట్లాడుతూంటే, నీ ఆకారపు మూసలో పోసిన అమాయకత్వపు ముద్దవనీ, నువ్వొక వట్టి ఫూలువనీ అనిపిస్తుంది!"

"కావచ్చు....! రచయితకు కొమ్ములుండవ్. వాడు ఆకాశం మీంచి ఊడిపడలేదు. వాడు కూడా మామూలు మనిషే. సామాన్య మానవుడిలో ఉండే బలహీనతలూ, లోపాలోపాలూ అన్నీ వాడిలోనూ ఉంటాయ్!"

ఎందుకోగాని, కాంతం మొహంలో మబ్బు విడిచిన లేత ఎండలాంటిది ఏదో కనిపించింది నాకు.

"చూడు బావా...! నడి రోడ్డుమీద ఒక ఆవు నెమరు వేసుకుంటూ పడుకుంది. నీ మానాన నీవు ఆ ప్రక్క నుంచి పోతావ్.

ఆవు కొమ్ము విసురుతుంది.

నేనూ అంతే బావా!" కొమ్ము విసిరిన ఆవు నేల చూపులు చూస్తూ అంది!

**మన క్రికెట్ జట్టు బాగుపడాలంటే...**

